# 8 రసపుత్రులు

ఎన్ని వందల యేళ్ళ వయసు వుంటుందో ఆ చెట్లకి-చీకట్లతో మూలుగు తున్నాయి. వాటిని పెనవేసుకుని పాములవంటి తీగెలు, కొత్తవానలకి దట్టమైన చిక్కని ఆకుపచ్చ గడ్డి, మధ్య మధ్య నిలువెత్తున ఎర్రటి పుట్టలు, వాటిమీద దట్టమైన అడవి మొక్కలు. పైన చెట్ల గుబుర్లలోంచి చాలా ఎతునించి పిట్టల సాయంత్రపు కోలాహలం-ఎన్నడూ ఎరగని పరిమళాలు. అక్కడక్కడ కొంచెం కొంచెం దూరంలో శిధిలమైన రాతిగోడలూ, గోపురాలూ, నల్లని కోటలు కూడా. గోడల్లోంచీ కప్పుల్లోంచీ చెట్టూ గడ్డి మొలిచి, అడివిని ధ్వంసంచేసి మానవుడు కట్టుకున్న నివాసాల్ని మళ్ళీ అడివి కబళించి ఆక్రమించుకుంటోంది.

వెలుతురు తగ్గగానే గడ్డిమీద కొంచెంగా కోమలంగా చెదురుతూ పడ్డ వెన్నెల తలుపు చెప్పింది, ఎక్కడో చంద్రోదయమయిందని. భయపడి వెనక్కి తిరిగాను. నా కలలలో, నా సౌందర్య తత్పరతలో తోవ తప్పాను. సరిగ్గా నా మొహం వీపు వేపు తిప్పి నడవడం సాగించాను. కాని నమ్మకం లేదు నాకు, ఆ రాత్రికి వూరు చేరతానని.

రెండు గంటలు పేసన్నా నడిచి వుంటాను. వెన్నెల వెలుతురు చీకట్లతో నన్ను భయపెట్టడానికే ఉపకరించింది. అప్పుడప్పుడు నిద్రకి సద్దుకునే పిట్టల కలకలం నా గుండెను దబ దబ లాడించింది. ఎటు తిరిగినా పుట్టలే. నా కాళ్ళకింద విరిగి పెళ్ళుమనే ప్రతి కొమ్మకీ బెదిరి ఆగాను. అడవుల్లో రాత్రులు తిరిగారనీ, ఉండిపోయినారనీ, చాలా కాలం కులాసాగా గడిపారనీ, పర్ణశాలలు నిర్మించుకున్నారనీ, కథలు రాసిన మనుషులు నా జీవితంలో ఎన్నడన్నా నా కంటపడితేనా!

ఆ రాత్రికి ఇంతే! ధైర్యంచేసి ఎక్కడ కూచోగలను? పడుకోగలను? ఒక్కొక్క శిథిల మందిరమే దెయ్యంలాగు నా కంటికి దగ్గిరిగా వొస్తోంది. తిరిగిన చుట్టూనే మళ్ళీ తిరుగుతున్నాను గావును ఆ రాత్రి. కూచోవాలి కొంచెం. మళ్ళీ ఇంకో పాత కోట. నల్లని. గోడలమీద పడుతోంది పండు వెన్నెల. అంత భయంలో కూడా ఆ అందం నన్నాపింది. నాకుఅడ్డంగా మెట్లు. పగిలిపోయిన దిక్కుమాలిన మెట్లు మూడు. వాటిల్లో బొక్కలు లేకుండా చూసుకుని కూచున్నాను. అట్లా చెట్ల చివర్ల మెరిసే వెన్నెల్ని చూస్తో నిద్రపోయినానేమో తెలీదు.

తెలివి వొచ్చేప్పటికి చెట్లమీదనించి పాకి నిండు చంద్రుడు కనబడుతున్నాడు. కోట నీడలు గోడల కిందికి జరిగాయి. దాహం. మెట్లెక్కితే పూర్వం ఏ గదిలోదో అది, కొంచెం గచ్చు ఇంకా మిగిలి వుంది. దానిమీద నుంచుని నాలుగు దిక్కులా చూశాను. ఇందాకటి కోట గోడ పైన ఉన్న పడిపోయిన మేడలో కిటికీలోంచి దీపం. ఆశ వొచ్చింది. కాని ఈ కోటలో దీప మేమిటి? దొంగలేమో! లేక నర బలులిచ్చే కాళీ ఉపాసకులా?

కాని ఏం చెయ్యను? మెల్లిగా అటు నడిచాను. కోట చుట్టాను పాములకి భయపడుతో, దోవ తడుముకుంటో. మెట్లు పూర్వం కోట లోపలి మెట్లులాగు వున్నాయి. కోట పడిపోయి ఇప్పుడు బైలు పడ్డాయి. ఆ మెట్లు మీదనించి డాబామీదికి చేరుకున్నాను. అక్కడి గది తలుపు మూసి వుంది. తెరిచి ఉన్న కిటికీ దగ్గిరికి చేరుకున్నాను ఆ కిటికీ చుట్టూ పెద్ద తీగె అల్లుకుంది. నేను నుంచున్న డాబాకీ, ఆ కిటికీకి

మధ్య స్థలం కూలిపోయింది. ఆ తీగె సందుల్లోంచి గది లోపల కనిపిస్తోంది నాకు.

ఆ గది చుట్టూ దీపాలు, పూర్వకాలపు ప్రమిద దీపాలు. వెండి విగ్రహాల చేతుల్లో ఆ ప్రమిదలు. కాలిన సువాసనల పరిమళాలు వాటిల్లోంచి. ఏ అత్తర్లతో వెలిగించారో! ఆ కోట అంతా శిథిలమైన ఆ ఒక్క గదినీ ఎవరో జాగ్రత్తగా కాపాడుకువొచ్చారు, ప్రపంచంతో సంబంధం లేకుండా. ఎందుకంటే అట్లాంటి గదుల్ని కొంచెంగా సినిమా సెట్టింగుల్లో చూస్తాము. గోడలకి అనేక రకాల ఆయుధాలు, లోపలి తలుపులకి చిక్కని రంగు మొహమల్ పరదాలు, పూర్వరకం కుర్చీలు, సింహాసనాల వంటివి. ఒక హంస రూపపు పెద్ద మంచం మీద, మొహమల్ దిళ్ళమీద తల పెట్టుకుని ఒక సుందరి. ఆమె యీ కాలానికీ, ఈ నాగరికతకూ చెందిన మనిషి కాదు. ఆజంతా చిత్రం ప్రాణం పోసుకు పడుకున్నట్లు వుంది. ఏమి అందం! ఆమె మెళ్ళో నక్షత్రాల లాగు వెలుగుతున్నాయి వజ్రాలు, ఆమె రొమ్ముమీదనించి చిక్కులుగా జారుతో. ఆ దిళ్ళ మధ్యా ఆ మెత్తని పరుపు గుంటల్లోనూ ఆమె అంతా కనపట్టంలేదు నాకు. కదలక, అట్లా ఏదో ఎదురు చూస్తో పడుకుంది. ఆ స్తలాన పాతేసి నట్టు నిలబడ్డాను. మంచానికి చుట్టూ పెద్ద పెద్ద పూల దండలు. అప్పుడే విచ్చుకొంటున్న జాజి మొల్ల పూల కుచ్చులు. ఒరే! కలలోనన్నా తలుచుకోలేవురా ఆమె అందాన్ని!

ఏమిటో జాగ్రత్తగా వింటోంది. మొహంలోకి ఆత్రుతా సంతోషం కదిలాయి. కళ్ళు ఆర్పింది. లేకపోతే ప్రతిమ అనుకుందును. నేనూ విన్నాను, దగ్గిరికి వొస్తున్న గుర్రపు డెక్కల ధ్వని. మెల్లగా దిండుమీది వేళ్ళను కదిలించి, సన్నని చిక్కని వూదారంగు పట్టు శాలువని ఒంటిమీదికి లాక్కుంటో లేచింది. ఎంత పొడుగు అను కున్నావు ఆమె! మెరిసి పోతోంది ఒళ్ళు, ఆ శాలువలోంచి ఆ దీపాల ముందు. నిదానంగా కదిలింది కిటికీ దగ్గిరికి. కిటికీలోంచి వెన్నెట్లోకి తళ తళ మెరిసే గాజులున్న చేతిని జాపింది. వెన్నెల ఆమె చెంపల మీద మెరిసింది. గుర్రపు చప్పుడు దగ్గిరయింది. కిటికీ కింద ఆగు

తోంది. చెయ్యి తీసేసుకుంది లోపలికి. కిటికీ దూరంగా జరిగింది. ఆ నిమిషంలో భూమి మీద నించి కిటికీలోకి దూకాడు ఒక రాజకుమారుడు. తలుచుకో ఆ యెత్తు మేడ మీదికి. ఎట్లా తెలుసు నంటావా రాజకుమారుడని, అతన్ని చూడాల్సింది నువ్వు, ఇంక నన్ను ప్రశ్నించకు. ఏం జరిగిందో, వాళ్ళిద్దరు ఒకరిలో ఒకరు యేమైనారో! ఒక్క మాట లేదు. వాళ్ళ చూపులూ, దిగులైన చిరు నవ్వులూ, చేతి వేళ్ళూ చాలు, కావ్యాలు చెప్పడానికి. ఒక్క నిమిషంలో ఒకపైని నిలిచేరు. ఎంత సేపంటావు? ఓ గంట అనుకో. అక్కడే ఆ స్థలాన్ని శిలతో చేసిన పెనవేసుకున్న ప్రతిమల్లాగు. చలం వర్ణిస్తాడే-ఎక్కడా వందమైళ్ళ దూరానన్నా అందుకో దనుకో నేను చూపిన ఆ మొహాన్ని! నా కళ్ళు చెదిరిపోయినాయి. చీకట్లు కమ్మాయి. అతని వేషమూ, అతని బట్టలు ఏమీ చెప్పలేను. మళ్ళీ కళ్ళు తెరిచేటప్పటికి, నాకు జ్ఞాపకం కలిగేటప్పటికి ఇద్దరూ పక్కమీద వున్నారు. పువ్వుని చేత్తో తాకుతున్నట్టు తాకుకున్నాడు ఆమె ఒంటిని. ఆమె పొడుగైన వంకర రెప్పల్ని మూసేసుకుని కదలక పడుకుంది. పీడల్లో కూడా ఆమె వక్షంలోని దీర్ఘ నిశ్వాసం మెరుస్తోంది ఆ వజ్రాల వల్ల.

తరవాత విల్లు వంటి అతని వీపు తప్ప ఏమీకనిపించలేదు. చాలా నాజూకైన అతని కదలిక - సీతాకోక చిలక కనకాంబరం మీద వాలి తేనె తాగడం చూశావా? ఒక గంట అట్లానే నిలబడి వున్నాను, స్వర్గ దృశ్యం చూస్తున్నట్లు.

మెల్లిగా వాళ్ళ తలల వెనక తలుపు మొహమల్ తెరగాలికి కదిలినట్టు కదిలింది. తెరవొత్తిగించి జేగురించిన మొహంతో ఒక యువకుడు నుంచున్నాడు. కెవ్వున అరిచాననుకో. కాని బైటికి అరిచానో లేదో ఈ నాటికీ తెలీదు నాకు. కాని వాళ్ళెవరూ వినలేదో; నా అరుపు వినే స్థితిలో లేరో;

ఒక్క నిమిషం అట్లా చూస్తో నుంచున్నాడు. మొహాన ఎరుపు తగ్గింది. పెదవుల కొనల్లో కొంచెం అతని tension తెలిపిందేమో

[illegible] కదలికలోనేమో! పిల్లిలాగు వొచ్చి గోడనున్న కత్తి తీశాడు. అప్పుడు స్పష్టమయింది నాకు అతను భర్త అనీ, వాడు ప్రియుడనీ.

కత్తి ఒర నుంచి నిశ్శబ్దంగా తీసి, వాళ్ళ పక్కదగ్గిరికి వొచ్చి కత్తి నెత్తాడు—అతుక్కున్న ఇద్దరి మీదికీ. సరిగా రెండు కంఠాల మీదికి. మళ్ళీ అరిచాను. నిజంగానే అరిచినట్లున్నాను. కాని వాళ్ళకి వినపడ్లేదు - యెందుకు వినపళ్ళేదో!

ఆగాడు, ఓ నిమిషం వాళ్ళవంక నిప్పులు కురుస్తో చూస్తో. ఏం దప్పుడు చేశాడో లేక మాట్లాడాడో నాకు వినపళ్ళేదు. అతని పెద వులు కదిలాయి అనిపించింది. అది విని ఆమె నించి కళ్ళు యెత్తడం గాని మనసు మళ్ళించడంగాని, సహించనట్టు మెల్లిగా, బద్ధకంగా కళ్ల మాత్రంయెత్తాడు, ఆ గొప్ప రసికుడు. ఆమె కళ్ళన్నా విప్పలేదు. నమ్ముతావా? కదలలేదు. వేళ్ళన్నా కదిలించలేదు. ఆ రొమ్ము మీద రత్నాలు ఇంకొంచం మెరిశాయేమో!

ఆ ప్రియుడు భర్త మొహాన్నీ, తళతళమంటున్న కత్తినీ తీరుబడిగా నిదానంగా చూసి, పెదవులు తృణీకారంగా వెనక్కితిప్పి. తన దృష్టిని యెప్పటివలె ఆమె కళ్ళమీదికి తిప్పాడు. నిశ్చలంగా రెండు తాచు పాముల్లాగు అట్లానే పడుకున్నారు ఆ ప్రియులు. "ఇట్లాంటి స్థితిలో చంపుతావా. ఇంత నీచుడివా, ఇంత నీచుడివా?" అన్నట్టనిపించింది ఆ విలాసుడి ఆ విలాసుడి చూపు.

ఏం మనుషులో వాళ్లు! దేవతలో! ఆ భర్త ఎత్తిన కత్తిని కిందికి దాంపి. వాళ్ళకి వీపు తిప్పి నుంచున్నాడు. శిలా స్తంభం వలె.

ఎంత కాలం? నన్నడక్కు. క్రమంగా ప్రియుడి వెన్నెముక లోంచి, తలలోంచి పిరుదుల వరకు చలనం. ఆమె వక్షంలోంచి నిట్టూర్పు లాగు వజ్రాల మెరుపు లోతులు....గట్టిగా ఒకచే ఐనట్టు పెనగడం కొంచెంగా....ఆమె కళ్ళుతెరిచింది, గొప్ప చిరునవ్వుతో తన కృతజ్ఞతని అతని కళ్ళలో మెరిపించింది. ఆమె చెక్కిలి పట్టు కుని కళ్ళల్లోకి లోతుగా చూసి అతను లేచి భర్తని బుజంమీద తాకాడు.

వెనక్కి తిరిగైనా చూడకుండా అతను ఇంకో కత్తిని గోడనించిలాగి తన విరోధికి ఇచ్చాడు చాలా గౌరవంగా. ఎడమ కంటి కొలికిలోంచి వాళ్ళని చూస్తో కదలకుండా అట్లానే వెల్లకితలా పడుకుని వుంది. ఆమె ప్రియుడు కత్తిని యెత్తే లోపల భర్త వెనక్కి తిరగకుండావే కత్తితో ఒక్క వలయం చుట్టాడు. ఆమె తల తెగి కిందికి దొర్లింది. తరవాత ఒక్క అరనిమిషం కత్తుల మెరుపులో వాళ్ళిద్దరూ కనపళ్ళేదు. కళ్ళు తెరిచే లోపల ఇద్దరూ పడిపోయినారు రక్తపు మడుగులో. వాళ్ళ పాటుకుగాను ఇల్లు మేలుకుంది. నా అడుగుల కిందనించి, నెత్తిపై నించీ - చుట్టూ గదులనించి పరగెత్తుతూన్న అడుగుచప్పుడు. ఒళ్ళు తెలియక పరిగెత్తాను భయంతో. ఎంత దూరమో! కాళ్ళు వాచి కాయి. కళ్ళు తిరిగాయి. కూల బడ్డాను.

ఎవరో నా భుజం పట్టుకు వూపుతున్నారు. కళ్ళు తెరిచేటప్పటికి బాగ పొద్దెక్కింది. నేను రాత్రి మొదట కూచున్న చెట్టుకింద పడుకుని వున్నాను. నా పక్కన ఒక ముసలి సాయేబు. తెల్లటిబట్టలూ తెల్లని గడ్డమూ అతనూ. చుట్టూ చూశాను. అంతా జ్ఞాపకం వొచ్చింది.

"ఎవరు?" అంటున్నాడు అతను.

"మీ రెవ" రన్నాను.

"ఇక్కడ కావాలి; ఈ పాతకోటకి."

"ఏమయింది తరవాత?"

తెల్లబోయి చూశాడు.

"మీ ప్రభువు...."

ఇంకా అర్థం కాలేదు అతనికి.

"నిన్న రాత్రి లేరా ఇక్కడ?" అన్నాను.

"లేను."

"ఏమైనారు?"

"అదంతా ఎందుకు? మీ రెవరు?"

నాకు అనుమానం తడుతోంది. చుట్టూ అడివి. కోటంతా పడి

పోయి వుంది. ఉత్త గోడలు. నిన్నటి రాత్రి గది ఎక్కడ వుందో పోల్చకోలేకండా వున్నాను. గోల చేస్తున్న పిట్టలు తప్ప, మే మిద్ద రమే ప్రాణులం,

"ఎవరి నౌకరు నువ్వు?" అని అడిగాను.

"బ్రిటిష్ గవర్నమెంటు."

"ఎందుకు ఇక్కడ?"

"ఈ స్థలంలో పూర్వం గొప్ప కోట వుండేది రాజపుత్రులకి. ఎన్ని వందల యేళ్ళ కిందటో! దీంటో రహస్యంగా అపారమైన ధనం వుందంటారు; అందుకని."

"ఎవరూ తవ్వలేదా?"

"పూర్వం మొదట ఇంగ్లీషు సైన్యం వొచ్చినప్పుడు ఈ వేపు ఒక మిలిటరీ అధికారి ప్రయత్నించాడట. రక్తం కక్కుకు చచ్చి పోయినాడు. తరువాత ఇద్దరు కలెక్టర్లు ఇంగ్లీషు వాళ్ళచేత తవ్వించా లని చూశారు, మన కూలీలు ఒప్పుకోకపోతే. ఆ తవ్వేవాళ్ళూ కలెక్టర్లూ అందరూ చచ్చారు. మా వంశంవాళ్ళు తాత ముత్తాతలనించీ ఈ కోటకే నౌకరీ."

"మరి నిన్న రాత్రి...."

"ఇక్కడ వున్నారా యేమిటి?"

తల వూయించాను. జాలిగా నవ్వాడు అతను.

"చూశారా?"

తల వూయించాను.

"చూసి బతికి వున్నారా? అదృష్ట వంతులు!"

"చూసి నందుకా అదృష్టం, ఇంకా బంతికి వున్నందుకా?"

"రండి చెప్తాను."

అక్కడే ఓ పాత కొట్టు శుభ్రం చేసుకుని అతని కాపరం.

లోపల అతని సంసారం వున్నట్టుంది. గోధుమ రొట్టెలు, టీ ఇచ్చి ఈ కథ చెప్పాడు:

"మా ముత్తాతల తాతల నాటి కాలం అది. ఈ రాజ్యానికి కొత్త కోడలు వొచ్చింది, చాలా అయిష్టంగా. ఈ రాజపుత్రుడూ, వాళ్ళ వంశమూ, చాలా గొప్ప శౌర్య వంతులు. మానానికి ప్రాణాల్ని అవలీలగా ఇచ్చేవారు. చాలా కొద్ది కాలంలో, సంవత్సరానికో రాత్రి-కార్తీక పౌర్ణమి రాత్రి-ఎవరో గుర్రం మీద వొచ్చి, ఆ గది కిటికీ లోంచి లోపలికి దూకి, కొత్త రాణితో రాత్రి గడిపి తెల్లవారకుండా శెళ్ళేవాడు అని పుకారు. అతన్ని అడ్డం పెట్టగల సాహసంగాని, రాణీకి కోపం తెప్పించే ధైర్యంగాని యెవరికీ లేవు.

పెళ్ళి కాకముందే ఆమెకి ఒక రాజకుమారుడి మీద ప్రేమ అనీ, తండ్రి బలవంతం వల్ల మా రాజుని వివాహ మాడిందనీ, ప్రతి కార్తీక పౌర్ణమినాడు కలుసుకుంటానని అతినికి వాగ్దాన మిచ్చిందనీ వినికిడి. అంతకన్న వింత - మా రాజుకి తెలుసునా తెలీదా, ప్రతి కార్తీక పౌర్ణమికీ ఎవరో వొస్తున్నారని? ఆ రాత్రి ఏమౌతున్నాడు? తెలిసే, గతిలేక ఒప్పుకున్నాడా? పదేళ్ళు గడిచింది పదేళ్ళు రాజుకి తెలియకుండా జరుగుతుందా?

ఓ ఉదయం రాజు ఈ అడవిలో స్వారి వెళుతుండగా ఒకడు దూరంనించి 'కార్తీక పౌర్ణమి' అని అరిచాడు. అందరూ కూడా విన్నారు. రాజు అవమానంచేసి వెళ్ళకొట్టిన నౌక రని అనుమానం. రాజుకి చాలా ఆగ్రహం. కోపంలో ఉచితానుచితాలు ఎరగనంత ఉద్రేకం. 'కార్తీక పౌర్ణమి' అనే మాట అతని మనసులో మెదలు తోనే వుంది.

ఆ సంవత్సరం కార్తీక పౌర్ణమి నాడు అతనికి జ్ఞాపకముంది ఆ మాట. ఆ రాత్రి తాను పెందరాళే నిద్ర పోవడమూ రాణీగారి గది

వెళ్ళక పోవడమూ తెలుసుకున్నారు. ఆలోచించగా, ఏ కార్తీక పౌర్ణమినాడూ తానా చంద్రుణ్ణి చూసిన జ్ఞాపకమే లేదు. ప్రతి కార్తీక పౌర్ణమికీ తానెందుకిట్లా నిద్రపోవాలి? ఒక సంవత్సరం ఆగాల్సి వొచ్చింది ఆ మహారాజు. సంవత్సరమంటే మనకిమల్లే అనుకోకండి ఒక కసిగాని, అనుమానంగాని వాళ్ళమనసుల్లో ఎవరికీ తెలీకుండా నిద్ర పోతుంది సులభంగా. ఆ కార్తీక పౌర్ణమినాడు, తన భోజనమూ పానీయమూ జాగ్రత్తగా గమనించాడు. కాని నిద్రపోయినాడు, రాత్రంతా లేవకుండా. ఎందుకు కలిగిందో రాణి మీద అనుమానం మరి. కాని మళ్ళీ సంవత్సరం ఆగాడు. మనకు మల్లే కాదు. అనుమానం కలిగిందని తెలియ చెయ్యడం, తన అనుమానం అబద్ధం కావడమూ జరిగాయా బతకలేరు ఆ మనుషులు. అట్లాంటి అనుమానం రాణికి తెలియజేశాడా ఖర్ర. అక్కడితో ఆ రాణి తలుపులు బందు, రాజుగారి ప్రవేశానికి. వాళ్ళు రసపుత్రులు!

ఆ కార్తీక పౌర్ణమి సాయంత్రం జబ్బుగా వున్నదనీ, ఆకలి లేదనీ తన గదిలో వుండిపోయినాడు ఆయన. కొంచెం షరబత్తన్నా తాగమని కబురంపింది రాణి. వొద్దన్నాడు. తను స్వయంగా తీసుకొస్తానని రాణినించి కబురు. అనుమానం స్థిరమయింది. రాణి తీసుకువొచ్చి బల్లమీద పెట్టి, ఆయన దగ్గిర కొంచెం కూచుని వెళ్ళిపోయింది. రాజుగారు ఆ షరబత్ పారపోశారు. రాణిగారి దాసి ఆ గాజు పాత్రని తీసుకెళ్ళి రాణిగారికి చూపింది. రాజు నిద్రపోలేదు. కదలకుండా పడుకున్నాడు మామూలు ప్రకారం. రాత్రి ఎప్పటివలె గుర్రం మీద ప్రియుడు. తరవాత ఏం జరిగిందో తెలీదు. రాత్రి రెండు గంటలకి రాణి గదిలో పెద్ద శబ్దాలై పరుగెత్తారు కోటలోని మనుషులు. రాణి తల, కిందపడి దొర్లుతోంది. రాజూ, ఆ కొత్త యువకుడూ ద్దరూ చచ్చిపడి వున్నారు."

"నిన్న కార్తీక పౌర్ణమా?" అన్నాను.

"అవును. కార్తీక పౌర్ణమి రాత్రి ఎవరూ పొరపాటునైనా ఇటు రారు; నేనూ వుండను."

"ఎందుకు?"

"దెయ్యాలు మేలుకుంటాయి."

---